రైతుపై విత్తనభారం..

- రెట్టింపు అయిన జీలుగ, జనుము విత్తనాల ధరలు
- సాగుకు వెనుకడుగు వేస్తున్న రైతులు

బయ్యారం: పచ్చిరొట్ట సాగు చేద్దామనుకున్న రైతులకు పెరిగిన విత్తనాల ధరలు భారంగా మారాయి. గత ఏడాది కన్న పచ్చిరొట్ట విత్తనాల ధరలు రెట్టింపు కావడంతో పేద రైతులు విత్తనాలు అంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. వానాకాలంలో రైతులు సాగు చేసే వరి, మిరప పంటలకు ముందు తొలకరి వర్షాలు కురిసిన వెంటనే జీలుగ, జనుము విత్తనాలు చల్లుతారు. పంట 40రోజుల కాలం వచ్చే సరికి భూమిలో కలియదున్నడం ద్వారా సాగు చేసే పంటకు పచ్చిరొట్ట బలంను ఇస్తుండటంతో రైతులు జీలుగ, జనుము విత్తనాలను సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది కిలో రూ.71.25

50శాతం ప్రభుత్వ సబ్సిడీ పోను గత ఏడాది ఇదే నెలలో కిలో రూ.37.20జీలుగు విత్తనాలను రైతులకు విక్రయించగా ఈఏడాది కిలో రూ.71.25 విక్రయిస్తున్నారు. ఇదేవిధంగా గత ఏడాది కిలో రూ.36.20కి జనుము విత్తనాలు విక్రయించగా ఈ ఏడాది కిలో రూ.62.75 విక్రయిస్తున్నారు. ఇలా గత సంవత్సరం 30కిలోల జీలుగు బస్తా రూ.1,116 రైతుకు చేరగా ఇప్పుడు అదనంగా రూ.1,021 పెరిగి రూ.2,137లకు, జనుములు 40 కిలోల బస్తా రూ.1,448 చేరగా అదనంగా రూ.1,062 పెరిగి రూ.2,510లకు చేరుతుంది.



జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య (ఫైల్)

అదనపు భారం..

జిల్లాలోని పలు మండలాల పరిధిలో 10వేల క్వింటాళ్ల జీలుగ, 1000 క్వింటాళ్ల జనుము విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. గత ఏడాది 10వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలకు రైతులు రూ.1.11కోట్ల రూపాయలు వెచ్చించగా.. ఈ ఏడాది పెరిగిన ధరలకు అదనంగా 1.02 కోట్లు వెచ్చించాల్సి వస్తుంది. ఇదేవిధంగా 1000 క్వింటాళ్ల జనుము విత్తనాలకు గత ఏడాది రూ.14.48 లక్షలు వెచ్చించగా ఈ ఏడాది అదనంగా రూ.10.62లక్షలు వెచ్చించాల్సి వస్తుంది. ఇలా జిల్లా రైతులు జీలుగ, జనుము విత్తనాలకు రూ.1.12కోట్ల అదనపుభారం మోయాల్సి వస్తుంది.

విత్తనాల ధరలు ఇబ్బందిగా ఉన్నాయి..



ప్రతి ఏడాది జీలుగ విత్తనాలను వరిసాగుకు ముందు పొలంలో చల్లి కలియదున్నుతా. ఈ ఏడాది గత ఏడాది కంటే అధికంగా ధర ఉండటంతో జీలుగు విత్తనాలను చల్లడంను తగ్గించుకుంటున్న. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నా ఇలా ధరలు పెరగటం మాలాంటి సామాన్య రైతులకు ఇబ్బందిగా ఉంది.

– ఏప శ్రీరాములు, చర్లపల్లి

నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి

గూడూరు: సాగుకు ముందు రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని మహబూబాబాద్ డివిజన్ సహ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస రావు అన్నారు. గూడూరు శివారు వడ్డెరగూడెం రైతు వేదికలో బుధవారం నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రతీ రెవెన్యూ గ్రామంలో ముగ్గురు అభ్యుదయ రైతులను ఎంపిక చేశామని, వారికి వ్యవసాయ శాఖ గుర్తించిన నాణ్యమైన వరి, పెసర విత్తన ప్యాకెట్‌ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర మల్యాల ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు, ఎడ్ల నరేష్‌రెడ్డి, ఏఓ అబ్దుల్‌మాలిక్, ఏఈఓలు మనోజ్, వినయ్, మధు, అలేఖ్య, సుస్మిత, రైతులు పాల్గొన్నారు.

నెల్లికుదురు: రైతన్నకు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రైతువేదికలో బుధవారం రైతులకు నాణ్యమైన పెసర విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏఓ ఎస్‌కే యాస్మిన్ బుధవారం తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కేసముద్రం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని రైతువేదిక భవనంలో నిర్వహించిన నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 15 రెవెన్యూ గ్రామాల రైతులకు వరి, పెసర మినీ కిట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఏఓ వెంకన్న, కేసముద్రం, ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్‌లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్ రావుల మురళీ, బండారు వెంకన్న పాల్గొన్నారు.


గూడూరు: విత్తనాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గూడూరు: టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనకాల వచ్చిన ఓ కారు ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయమై, పరిస్థితి విషమంగా మారిన సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి పక్కన జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. వివరాల ప్రకారం మండలంలోని దామరవంచ శివారు పిల్లిగుండ్లతండాకు చెందిన గుగులోతు వాసునాయక్ తన ద్విచక్రవాహనంపై గూడూరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి వద్ద వెనకాల వచ్చిన కారు ఢీకొనడంతో అతని తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది. వెంటనే కారు నిలిపిన డ్రైవర్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. అంబులెన్స్‌లో మానుకోట ఏరియా ఆసుపత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. బాధితుడి కుటుంబ సభ్యుల మేరకు ఫిర్యాదు అందినట్లు తెలిపారు.

పాకాల వాగులో మృతదేహం గుర్తింపు

గూడూరు: మండలంలోని కొల్లాపురం శివారు గంగదేవితండా సమీప పాకాలవాగులో మంగళవారం లభ్యమైన గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం గుర్తించినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. సమాచారం అందుకున్న మృతుడి బంధువులు ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలం నుంచి గూడూరు పీఎస్‌కు చేరుకున్నారు. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడని, మృతుడు దేశవత్ తిరుపతయ్య (53 దుస్తుల ఆధారంగా గుర్తించారు. వారి పిర్యాదు మేరకు శవపంచానామ నిర్వహించి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న విజయసారథి

కురవి: జూలై 5, 6వ తేదీల్లో కురవి మండల కేంద్రంలో మహబూబాబాద్ జిల్లా సీపీఐ 3వ మహాసభలు రెండు రోజులపాటు నిర్వహిస్తామని, మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. బుధవారం కురవి సీపీఐ కార్యాలయంలో కరణం రాజన్న అధ్యక్షతన పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. అనంతరం మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, అధ్యక్షుడిగా విజయసారథి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నల్లు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తమ్మెర విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బి.అజయసారథిరెడ్డి, సహ కార్యదర్శిగా కట్టెబోయిన శ్రీనివాస్, కోశాధికారిగా కరణం రాజన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నెల్లూరు నాగేశ్వర్‌రావు, పెరుగు కుమార్, మామిండ్ల సాంబలక్ష్మి, చింతకుంట్ల వెంకన్న, నవీన్, వరిపల్లి వెంకన్న, పాండురంగాచారి పాల్గొన్నారు.

మహిళల సమానత్వం కోసం పోరాటాలు

నెహ్రూసెంటర్: మహిళలకు అన్నిరంగాల్లో సమానత్వం, సమానపనికి సమాన వేతనం, మహిళలకు అన్నిరంగాల్లో 50శాతం రిజర్వేషన్ల కోసం క్రియాశీలక పోరాటాలకు సిద్ధం కావాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి అన్నారు. సంఘం 71వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘ కార్యాలయంలో జెండాను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంబలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరుగుతున్నాయని వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఎండి ఫాతిమా, ఎర్రోజు పద్మ, ఎండి. అలీమా, ఉమా, సమ్మక్క, పార్వతి పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న సాంబలక్ష్మి

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం


మరిపెడ రూరల్: ఆర్థికసాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు


గూడూరు: మచ్చర్లలో నగదు అందిస్తున్న బాల్య మిత్రులు

మరిపెడ రూరల్: మండల కేంద్రంలోని శాంతినికేతన్ 2004–05 పదోవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. చంద్రుతండాకు చెందిన తమ తోటి పూర్వ విద్యార్థి వీరాచారి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని ఎల్లంపేటకు చెందిన మరో పూర్వ విద్యార్థిని బీరెడ్డి ఉమ భర్తను కోల్పోయింది. దీంతో తోటి పూర్వ విద్యార్థులు బాధిత రెండు కుటుంబాలకు చెరో రూ. 20,500 చొప్పున రూ.41,000 ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గురువులు రేపాకుల యాదయ్య, రాచకొండ రామచంద్రయ్య, పూర్వ విద్యార్థులు దిలీప్ కుమార్, శ్రావణ్, శేఖర్, విజయ్, రమేష్, రామోజీ, విజయభాస్కర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన మడిపెద్ది మధు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడితో చదువుకున్న 1998–99 బ్యాచ్ పదో తరగతి మిత్రులు తాము న్నామంటూ బాధత కుటుంబానికి రూ.73వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రాము, సతీష్, శ్రావణ్, నరేష్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

దేవుడి చిత్రపటాలు తొలగించాలి

నెహ్రూసెంటర్: భగవంతుడి చిత్రపటాలను కాళ్లకు తగిలే విధంగా ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ ధర్మ జాగరణ సమితి, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భక్తులు జిల్లా కేంద్రంలోని మైత్రి మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. సందర్భంగా ధర్మ జాగరణ బాధ్యులు రానా శంకర్, నల్ల కిరణ్‌కుమార్, వీహెచ్‌పీ బాధ్యులు నల్ల కిరణ్‌కుమార్, మైస రోహిత్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో హనుమాన్ చిత్రపటాలను రోగులు నడిచి వచ్చి వెళ్లే దారిలో ఏర్పాటు చేశారన్నారు. భక్తుల మనోభావాలను కించపరిచే విధంగా ఏర్పాటు చేసిన హనుమంతుడి చిత్రపటాలను అక్కడి నుంచి తొలగించాలని నిరసన తెలిపారు. ఆసుపత్రి నిర్వాహకుడితో మాట్లాడగా తొలగిస్తామని చెప్పడంతో నిరసన విరమించినట్లు వారు తెలిపారు.

క్లుప్తంగా

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి బోనగిరి మధు అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డీఈఓ రవీందర్‌రెడ్డికి పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ.. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని, ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, శేఖర్, దీపక్, సుందర్, ఆసీఫ్ పాల్గొన్నారు.

'కూలీల డబ్బులు స్వాహా చేసేందుకు కుట్ర'

కొత్తగూడ: తునికాకు కూలీల డబ్బులు కొట్టేసేందుకు కాంట్రాక్టర్ కుట్ర పన్నాడని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగబోయిన రవి ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడారు. పూనుగొండ్ల యూనిట్ పరిధిలో జంగవానగూడెం కల్లంలో కాంట్రాక్టర్ కూలీ డబ్బులు, అనంతరం రావాల్సిన బోనస్ స్వాహా చేసేందుకు కుట్ర చేశాడని ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నర్సింగరావు, విజయ్‌కుమార్, రమేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కలశాభిషేకం

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో విమాన గోపురంపై జరుగనున్న సుదర్శన చక్ర ప్రతిష్ఠ, కుంభాభిషేక పూజల్లో భాగంగా బుధవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సంధ్యారాణి దంపతులు దర్శించుకు జలాభిషేకం నిర్వహించారు.

డాక్టరేట్ ప్రదానం

కేసముద్రం: హైదరాబాద్ జేఎన్టీయూలో జరిగిన 13వ స్నాతకోత్సవంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం కింద మున్సిపాలిటీలోని కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన పీడీ కొమ్ము రాజేందర్, గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్‌వర్మ సమక్షంలో వైస్ ఛాన్స్‌లర్ కిషన్‌కుమారెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు.

బాలిక ఆత్మహత్య

గూడూరు: వ్యవసాయ బావిలో దూకి ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గణ్యచక్రుతండా శివారు తేజ్యాతండాలో బుధవారం జరిగింది. గుగులోతు ఈరు, నీల దంపతుల కూతురు గుగులోతు స్రవంతి (16) ఇంట్లో నుంచి పరుగెత్తుకుంట వచ్చి వ్యవసాయ బావిలో దూకింది. విషయం తెల్సుకున్న తండావాసులు పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు, మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైన ఘటనలో ఆ బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. కాగా బాలిక అదృశ్యమయ్యేందుకు కారణమైన యువకుడిని గుర్తించి అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండుకు తరలించనున్నారు.

నోటీసులను వెనక్కి తీసుకోవాలి

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కన్యాకాపరమమేశ్వరి దేవాలయం పక్కన, కురవి రోడ్డులో ఉన్న వీధి వ్యాపారుల గుమ్టీలను తొలగించాలని నోటీసులు ఇవ్వడం దారుణమని వెంటనే ఆ నోటీసులను వెనక్కి తీసుకోవాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట గుమ్టీదారులు ఆందోళన చేసి కమిషనర్ రాజేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, ప్రవీణ్, మహేష్, గుమ్టీదారులు కవిత, భద్రయ్య, గోపాల్, పాషా పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంస్టేషన్ నుంచి కేసముద్రంవిలేజ్ వరకు వెళ్లే ప్రధాన రహదారిపై జేసీబీ యంత్రాలతో మరమ్మతు పనులను బుధవారం చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులపై అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో, వాహనాదారులు పడుతున్న ఇబ్బందులపై సాక్షి దినపత్రికలో గత మే నెల 29న 'గుంతల మయంగా రహదారులు' అనే శీర్షిక ప్రచురించబడింది. దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు యంత్రాలతో మరమ్మతు పనులు చేయిస్తున్నారు.

రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల స్వీకరణ

మరిపెడ రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రూపొందించిన భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణవేణి సూచించారు. రెండోవ రోజు బుధవారం మండలంలోని గుండెపుడి, గాలివారిగూడెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్‌చంద్ర, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండంలోని ఉగ్గంపల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి సదస్సులో సాయంత్రం వరకు 38 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ మహబూబ్ అలీ తెలిపారు.

కేసముద్రం: భూసమస్యలను పరిష్కరించేందుకు, గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ ఆర్డీఓ కృష్ణవేణి అన్నారు. మండలంలోని అన్నారం, ఉప్పరపల్లి గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను బుధవారం ఆమె సందర్శించి, మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, డీటీ ఎర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లికుదురు: భూభారతి రెవెన్యూ సదస్సులో ఆలేరులో 32, నైనాలలో 29, మొత్తం 61 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ చంద నరేష్ తెలిపారు.

కురవి: సీరోలు, కురవి మండలాల్లోని రేకుల తండా, తట్టుపల్లి, నారాయణపురం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులో రెండో రోజు బుధవారం నిర్వహించారు. తహసీల్దార్‌లు విజయ, పున్నంచందర్ మాట్లాడుతూ.. సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ గణేశ్, ఇస్లావత్ సుధాకర్, ఆర్ఐలు రవికుమార్, లక్ష్మీ, శ్రావణి, సుమతి పాల్గొన్నారు.


కేసముద్రం: ఉప్పరపల్లిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణవేణి

డోర్నకల్: మండలంలోని తొడ్డెళ్లగూడెం, రావిగూడెం గ్రామాల్లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై దరఖాస్తులు వెల్లువెత్తాయి. తహసీల్దారు ఇమ్మానియల్ మాట్లాడుతూ.. తొడ్డెళ్లగూడెంలో 110, రావిగూడెంలో 48 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

గార్ల: మండలం లోని మద్దివంచ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలంటూ బుధవారం రైతులు గంటపాటు ఆందోళన చేపట్టారు. ఎట్టకేలకు ఆర్డీఓ ఆదేశాల మేరకు రైతుల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. కాగా మద్దివంచ సదస్సులో 129 దరఖాస్తులు వచ్చినట్లు డీటీ సంజీవ వెల్లడించారు. కన్నాయిగూడెం సదస్సులో 70దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఆర్.శారద పేర్కొన్నారు.

గూడూరు: మండలంలోని అయోధ్యపురం, గోవిందాపురం గ్రామాలలో జరగ్గా, అయోధ్యపురంలో 149, గోవిందాపురంలో 114 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగభవాని తెలిపారు.

నేటినుంచి కార్మికుల పనులు నిలిపివేత


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్: మున్సిపల్ కార్మికుల వేతనాలు ఐదు నెలలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో ఈనెల 5వ తేదీ నుంచి పనులు నిలుపుదల చేయనున్నట్లు సీఐటీయూ, ఏఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, బి.అజయ్ సారథిరెడ్డి తెలిపారు. సీఐటీయూ, ఏఐటీయుసీ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ టి.రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, కాంపెల్లి శ్రీనివాస్, మధుసూదన్, శ్రీకాంత్, శ్రీనివాస్, విజయ్, రమణ, వెంగళరావు, ప్రియాంక, అశోక్, రామస్వామి, మురళీ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రెడ్యాకు పదవులు

డోర్నకల్: కాంగ్రెస్ పార్టీ దయతో పదవులు పొందిన మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కాంగ్రెస్‌నే విమర్శించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో జరిగిన గొడవలు రెడ్యానాయకే కారణమన్నారు. తన రాజకీయ ఎదుగుదలకు కారణమైన కాంగ్రెస్ కార్యకర్తలను చులకన చేసి మాట్లాడటం ఆయన అవకాశవాదానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లావుల హరికృష్ణ, తారాచంద్, శ్రీనివాస్, రాయల వెంకట్‌బాబు, నానియాదవ్, ఫరీద్, భూక్యా శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఖాదర్‌బాబా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుమేర్‌చంద్‌జైన్

సంక్షిప్త సమాచారం

డబ్బులు చెల్లించడం లేదు

మరిపెడ రూరల్: చేసిన కష్టానికి కూలి డబ్బులు చెల్లించడం లేదని మండలంలోని ఎడ్జెర్ల గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు వాపోయారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏపీఓ బీమ్లానాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కురవి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, ఆరోగ్య సిబ్బంది, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. బుధవారం కురవి పీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో విరాజిత, అనురాధ, వినోద, గౌసుద్దీన్ పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్: సీరోలు మండలంలోని చిలుకొయ్యలపాడులో మేకల బుచ్చిరాములు అక్రమంగా నిల్వుంచిన 2క్వింటాళ్ల నల్లబెల్లం, 10కేజీల పటికను హెడ్ కానిస్టేబుల్ రాములు పట్టుకున్నట్లు ఎస్సై ఉమ తెలిపారు. బుచ్చిరాములుతో పాటు మన్నెగూడెంకు చెందిన తేజావత్ రామ్మూర్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎంపీకి శుభాకాంక్షలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులుగా పోరిక బలరాంనాయక్ సంవత్సరం కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గంట సంజీవరెడ్డి, గుగులోత్ వంశీ, రియాజ్ అన్సారి, అంబటి మహేందర్ రెడ్డి, మేకల వీరన్నయాదవ్, యాదవరెడ్డి పాల్గొన్నారు.

పొలంబాట..

పెద్దవంగర: విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ శాఖ పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తోందని ఏఈ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని కాన్వాయిగూడెం గ్రామంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఓవర్ లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీని పెంచి రైతుల సమక్షంలో ప్రారంభించారు.

సైనికులకు సన్మానం



నర్సింహులపేట: అపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులు గుండగాని నాగరాజు, ఊదరి యాకయ్యలను బుధవారం మండల కేంద్రంలోని పీఎస్‌లో ఎస్సై మాలోతు సురేష్ శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

బయ్యారం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను బుధవారం ఎంఈఓ దేవేంద్రాచారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు భావ్‌సింగ్, వెంకటేశ్వర్లు, భాస్కర్, సీఆర్పీలు బాబులాల్, రవీందర్, భాస్కర్, సీఓ మోహన్‌బాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారు చంద్రు తండాలో రైతు బానోత్ భీమ్లాకు చెందిన కాడెద్దు మేతకోసం బుధవరాం తండా శివారులోని వ్యవసాయ భూముల్లోకి వెళ్లింది. అక్కడ ఉన్న విద్యుత్ మోటారు వైర్లు కాడెద్దు కాళ్లకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతిచెందింది. దీంతో బాధిత రైతుకు రూ.70వేల ఆస్తి నష్టం సంభవించింది.

రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు

డోర్నకల్: మూడు నెలల బియ్యం పొందేందుకు లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు పడుతున్నారు. మూడు నెలల రేషన్ బియ్యం పొందేందుకు ఒక్కో లబ్ధిదారుడు మిషన్‌పై ఆరుసార్లు వేలిముద్ర వేయాల్సి వస్తుండటం, ఒక్కోసారి సిగ్నల్ సక్రమంగా అందకపోవడంతో రేషన్ బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అధికారులు స్పందించి పంపిణీలో పాత పద్ధతినే కొనసాగించాల ని లబ్ధిదారులు కోరుతున్నారు.

టీకేఎంయూ కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని సీపీఐ మండల కార్యదర్శి తండా సందీప్ బుధవారం తెలిపారు. అధ్యక్షుడిగా జుజ్జూరి గురుస్వామి, ప్రధాన కార్యదర్శిగా కొమ్ము నారాయణను ఎన్నుకున్నారన్నారు.

ఫౌంటెన్ నిర్మాణ స్థల మార్పు ప్రజల విజయం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఫౌంటెన్ నిర్మాణ స్థల మార్పు ప్రజల విజయమని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గడ్డం అశోక్ అన్నారు. ఫౌంటెన్ నిర్మాణ పనులు జరుగుతున్న స్థలాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కేసముద్రం: పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన జల్లె నిర్మల (38), తన సమీప బంధువులతో ఇటీవల ఇంటిస్థలం విషయంలో వివాదం జరగడంతో మనస్తాపానికి గురై మే 30న పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను ఎంజీఎంకి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భర్త, కుమార్తె ఉన్నారు. కుమార్తె ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై

గార్ల: గుర్తుతెలియని నంబర్ల నుంచి ఫోన్లు చేసి మీ బ్యాంకు అకౌంట్ బ్లాక్ అయ్యిందని, మీ ఏటీఎంపై నంబర్లను చెప్పాలని అడిగితే, వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వెంటనే ఫోన్ కట్ చేయాలని ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా సూచించారు. బుధవారం గార్ల రైల్వేస్టేషన్ ఎదుట సైబర్ క్రైంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒకవేళ మీకు తెలియకుండా మీ బ్యాంకు ఖాతాల నుంచి నగదు కట్ అయితే వెంటనే సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్ల, కురుమల సమస్యలు పరిష్కరించాలి

డోర్నకల్: గొల్ల, కురుముల సమస్యలు పరిష్కరించాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ కోరారు. స్థానిక అశోక్‌భవన్‌లో బుదవారం నిర్వహించిన సంఘం సదస్సులో ఆయన మాట్లాడారు. గొల్లకురుమల ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. గొర్రెలు, మేకల సహకార సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మల్లేశం, ఉపేందర్ పాల్గొన్నారు.

బిల్లులు లేకుండా విక్రయిస్తే చర్యలు

కొత్తగూడ: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు బిల్లులు లేకుండా రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి ఉదయ్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని విత్తనాల షాపులను పోలీసు అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు చేశారు. ఎస్సై కుశకుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.